# పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం
# మత్స్యకారుల జీవితాలను పణంగా పెట్టిన CRZ నియమాలు-2018

**సార్వత్రిక** ఎన్నికల్లో ఓట్లను పొందటం కోసం రెండు పాలకపార్టీలు ఒకరినొకరు నిందించుకొంటూ, ప్రజాకర్షక పథకాల ఘనమైన ప్రకటనలెన్నో చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న భాజాపా 2011లో జారీ చేయబడిన నియమాలను సమీక్షిస్తూ తీరప్రాంత నియంత్రణ మండలి (CRZ)2018 నియమాలను రహస్యంగా విడుదలచేసింది.

ప్రస్తుత సవరణను హైకోర్టు తోసిపుచ్చి నప్పటికీ కేంద్రమంత్రివర్గ అనుమతితో కొత్త నియమాలు జారీచేయబడ్డాయి. హైకోర్టు ఆదేశాలను ఆర్డినెన్స్ ద్వారాగానీ, పార్లమెంట్‌లో ఆమోదం ద్వారాగానీ రద్దుచేయవచ్చు. మంత్రి వర్గ నిర్ణయంద్వారా వీలుకానప్పటికీ బిజెపి ప్రభుత్వం ఈ విధానాలను పట్టించుకోకుండా సవరణ చేసింది.

ఈ కొత్త నియమాల్లో అభివృద్ధిలేని ప్రాంతాల్లో అలల ప్రభావిత ప్రాంతాన్ని 100 మీటర్లనుండి 50 మీటర్లకు, ద్వీపాలలో 50 మీటర్లనుండి 20 మీటర్లకు కుదించారు.

2004లో సునామీ తదనంతరం వచ్చిన చట్టపరమైన యంత్రాంగాన్ని తొలగించారు. సముద్రంలో మురుగు మరియు వ్యర్థాలను కలపటంపై ఉల్లంఘనను గుర్తించడానికి దశల వారీగా వున్న గడువు ముగిసింది.

1991లో తీరప్రాంత నియంత్రణ మండలి చట్టాన్ని అట్టహాసంగా చేసినప్పటి నుండి 25 సవరణలు చేశారు. కానీ ఈ సవరణలేవీ చట్టంలోని పర్యావరణాన్ని మరియు ప్రజల జీవితాలను రక్షించే అంశాలను అభివృద్ధి పరిచేందుకు ఉద్దేశించినవి కాకపోగా ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా ఏర్పరచుకొన్న చట్టాలను నీరుకార్చేవిగా వున్నాయి.

కొత్తగా సడలించిన నియమాలు ఇప్పటికే ప్రమాదంలో వున్న తీరరేఖ వెంబడి వలసలను ప్రోత్సహించటం, నిర్మాణ కార్యకలాపాలను తీవ్రతరం చేయటంకోసం ఉద్దేశించినవి. ఇది స్థిరాస్థి వ్యాపార పరిశ్రమకు, సాగరమాల ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం తీరమండలిలోకి ప్రవేశించడానికి అనుమతిస్తుంది. ప్రభుత్వం ఒకవైపు దీనిని జాతీయ జల మార్గాల చట్టం -2016 క్రింద తీరరేఖలు మరియు నదీ తీరాలలో అసాధ్యమైన సాగరమాల ప్రణాళికను రుద్దడానికి, రెండోవైపున పెద్ద స్థిరాస్థి పరిశ్రమకు మరియు ప్రైవేటు పర్యాటక ఆస్తి వ్యాపారానికి ఒక వరంగా చేసింది.

ఈ CRZ-2018 పెద్ద, భారీస్థాయి స్థిరాస్థి వ్యాపారం చేసే అక్రమాలను అపరిమితంగా పెంచుతోంది. ఈ కొత్త సవరణలు దేశంలో వివిధ తీరప్రాంతాలపై పర్యావరణపరంగా ప్రతికూల ప్రభావాన్ని చూపడమేగాక, తీరప్రాంత సమాజాలైన, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, రైతులు ఇంకా చిరు వ్యాపారుల జీవితాలను నాశనం చేస్తుంది. కొత్త నియమాలు మడ అడవులు, పగడాలు, పగడపు దిబ్బలు విధ్వంసం చేయటంద్వారా జీవవైవిధ్యంతో సంబంధం కలిగిన ఇసుక దిబ్బలు, బురద నేలలు, ఉప్పు, చిత్తడి నేలలు, తాబేలు గూళ్ళు మొదలగు జీవావరణం ప్రమాదంలో పడుతుంది.

ఏప్రిల్ 2018లో ముసాయిదా నియమా లను బహిరంగపరిచినపుడు తీరప్రాంత రాష్ట్రాల నుండి దీనికి వ్యతిరేకంగా అనేక అభ్యంతరాలు తలెత్తాయి. కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు మిగిలిన వాటాదారులు ముఖ్యంగా సముద్ర పర్యావరణ వ్యవస్థల నిర్వహణ మరియు పరిరక్షణ, తీరప్రాంతాలలో అభివృద్ధి, పర్యావరణ పర్యాటకం, జీవనోపాధి ఎంపిక మరియు కోస్తా సమాజాల స్థిరమైన అభివృద్ధి మొదలైన వాటికి సంబంధించినవి.

2014 జూన్‌లో శైలేష్ నాయక్ కమిటీ సవరణను ప్రతిపాదించినప్పటి నుండి నేషనల్ ఫిష్ వర్కర్స్ ఫోరమ్ (NFF)తీర రాష్ట్రాలైన మహారాష్ట్ర, కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు మరియు గోవాలకు చెందిన అనేకమంది పార్లమెంట్ సభ్యులను న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో కలుసుకొని CRZ చట్టానికి ముసాయిదా సవరణలపై తమ అభ్యంతరాలను ఎత్తిచూపారు. కేంద్రమంత్రి సురేష్‌ప్రభు అభ్యంతరాల విషయం తాను చూసుకొంటానికి హామీ ఇచ్చాడు కూడా. ఇన్ని ప్రాతినిధ్యాలు, హైకోర్టు ఆదేశాల తరువాత కూడా బిజెపి ప్రభుత్వం కావాలనే కోస్తా ప్రజలను విస్మరించి, పెద్ద పారిశ్రామికవేత్తలకు, స్థిరాస్థి వ్యాపారులకు ప్రయోజనం కలిగించేలా కొత్త నియమాలను ప్రకటించింది. ఇది తీర ప్రాంతాలను ఉద్దేశ్యపూర్వకంగా చంపడమే.

కొత్త CRZ నియమాలు పూర్తిగా పర్యా వరణానికి, సాధారణ ప్రజలకు వ్యతిరేకమైనవి.

ప్రస్తుత CRZ నియమాలు పర్యావరణ పరిరక్షణ చట్టాలను తిరోగమన మరియు ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా మారుస్తున్నాయి. వీటిని రద్దుచేయాలి. భూమిని, తీరప్రాంత సమాజాల జీవనోపాధిని రక్షించుకోవాలనే డిమాండ్‌తో ప్రజలు ఐక్యపోరాటం ప్రారంభించి నిర్వహించటం తక్షణ అవసరం.

ooo